ఆ రాత్రికి సమయంలేదు.... కాని ఓ జీవితం విలువుంది. వెన్నెల చీకటి కలగలిసి కమ్ముకున్నాయి ఆ యింటి నా రాత్రి....

ఆ చీకటికి కోరిక.... ఆరాటం....

ఆ వెలుగుకి బాధ.... ఆశ

గదిలో లైటు వెలుగుతున్నా.. పాతల నాటి పందిరిమంచం, ఆ మంచం కింద పూర్తిగా ఇంకేం ఉపయోగం లేదని కప్పెట్టిన పాతసామాన్ల అంచులు.... ఆ వెలుగులో స్పష్టంగా కనిపిస్తునా.... ఆ గదంతా చీకటే.... తెల్లటి చీకటి.



ప్రేమగా మల్లెపందిరంతా వల్చుగాపాకి పచ్చటి ఆకులకి.... తెల్లటి మొగ్గలకి కొద్ది మాత్రమే తేడా మిగిల్చిన సిలి వెన్నెలైనా, అదే పండు వెన్నెల.

గది గుమ్మం దగ్గరుంది వసంత, తన దృష్టికి అంతే, బయటవున్నవి వెలుగు__ ఆశ. ఆగదిలో అవుండవు తనకి అక్కడ ఇరుకు_ చీకటి_ లోభం....

ఆగదన్నా, ఆ మంచమన్నా విపరీతమైన కోర్కుండేది వసంతకి ఆరేళ్ళ క్రితం_ పెళ్ళయిన కొత్తలో ఓ మూడు నెలలు_ అప్పుడు_ ఇప్పటిలా మల్లెపందిరిని మెల్లిగా తట్టి పిలిచే గాలిసవ్వడి తప్ప ఇంకేం వినపడని నిశ్శబ్దంలో ఇలా ఆ గదిలో అడుగు పెట్టే అవకాశం ఉండేదికాదు? పడకలకి ఇంట్లో ఉన్న వరండాచాలక ఆగదిలో కనీసం ఓ అరడజను మంది పిల్లలేనా చేరేవారు. అత్త_ మామ_ వయసొచ్చిన ఆడబిడ్డలు. పురిటికని వచ్చిన పెద్దాడబిడ్డ_ పిల్లలు, ఆ మూడునెలలు గది వాళ్ళవల్ల ఇరుగ్గా ఉండేది. ఆ తర్వాత భర్తని ఉద్యోగానికని వందమైళ్ళ దూరం తరిమారు.

ఇప్పుడెవరూ లేకపోయినా, ఆ గది ఇరుకే. ఆ ఇరుకులో ఇంక వొదిగే వోర్పు లేదు_ అందుకనే ఈ రాత్రికి సమయం అక్కర్లేదు వసంతకి_ ఏ క్షణమైనా పిలుపు_

"వసూ...."

గదిలోంచి_ మంచం మీంచి_ఆ పిలుపు ఆ పిలుపు సాఫీగా ఉండదు. నొక్కేసినట్టుంటుంది! ఆ గొంతుని ఆరాటం నొక్కేస్తుంది. ఆ పిలుపులో జీర_ ఒణుకు సెగలా మండుతున్న కోర్కెవి_ ఆ గదిలో మంచం మీద ఓ సింహం_ ఆ సింహం వొంటి నిండా ఆకలే_ ఆకలి తీరేవరకూ ఏం వినే ఓపికుండదు_ ఆ తర్వాత విన్నదానికి విలువుండదు.

"వసూ...." మళ్ళీ తొంగురుగా వినిపించింది భర్తపిలుపు_

తననితమ చూసుకుంది వసంత_ తన వొంటిని_ చీరని_ తనలోని ఆశని_ ముందుకి అడుగేయబోతుంటే చేతికి తలలోపూలు పల్లగా_ మంచులా తగిలాయి_

అలాపూలు పెట్టుకోవాలని, తెల్లచీర సింగారించుకోవాలని లేదు వసంతకి. కాని అనీ చేసింది. ఏ బలవంతంలేదు_ లోభంతప్ప. జీవితం అపుదుగా అందిస్తున్న అవకాశం తప్ప_

మల్లెపూలు పూసినన్నాళ్ళు ఎదిగిన ఆడబిడ్డలు, వయసొచ్చికేవలం పూలమీదే మనసునిండినవాళ్ళు ఇంటి నిండా ఉన్నారు. పూలు తృప్తిగా వసంత వరకూరావు. పూలు కొనుక్కొని పెట్టుకునే అవకాశము లేదు ఆ యింట్లో_ ఇంక ఒక్కరోజు, ఆ ఒక్క రాత్రి నెలకోసారి వస్తుంది_ ఉద్యోగానికి సెలవుపెట్టి, వందమైళ్ళు ప్రయాణం చేసి, ఒక్కరోజు మాత్రం గడపటానికి భర్తవచ్చినప్పుడు ఆ నాడు ఆడబిడ్డలు వంతుకి రావు_ సహజంగా పూల మీద ఆడదాని కున్న మమకారం చంపుకోలేక, నెలకోసారి వచ్చిన అవకాశం వదులుకోలేక, ఆ పూలు పెట్టుకోవటం_ వాటికి తోడుగా తెల్లటి చీరకట్టుకోవటం....

"ఎంతసేపు ఆ గుమ్మం దగ్గర_రావే"

కోర్కె ఆవేశంలోకి మారుతుంది_ ఆ తర్వాత కోపం....అసహనం....బాధ....

దీనికంతకి కారణం వెతికింది వసంత చాలాసార్లు. కనపడే కారణం ఒక్కటే.... మామగారు తనను పంపించకపోవటం. తెలిసి, కావాలనే తనని భర్తని విడదీసిన మామగారి పరిస్థితి తెలుసు. ఆరుగురు పిల్లల సంసారాన్ని అరవై రూపాయల గుమాస్తా ఉద్యోగంతో ఆయన నెట్టుకు రాలేదు, ఆ విషయం తెలుసు. ముందు కొన్నాళ్ళు సానుభూతుండేది....సరిపెట్టుకో గలిగింది జీవితాన్ని....కాని దానికి హద్దు లేదు....ఇలా సరిపెట్టుకోటానికి అంతు లేదు.

కొడుకు కోడలు కలిసి వేరే ఊళ్ళో కాపరంచేస్తే, వచ్చే నూటఏనభై రూపాయల జీతంలో కొడుకు డబ్బు పంపడని అనుమానం. పంపినా ఇంత ఎక్కువగా, ఇంత శ్రద్ధగా పంపడని అపనమ్మకం. అందుకని కనిపించిన ఉపాయం ఇదే... అదే చేస్తున్నాడు వసంత మావగారు.

ఆరేళ్ళు నిండిన ఈ నెలసరి దగ్గరి జీవితంలో... ఈనాడు వసంతలో ఆ ఇంటి పరిస్థితిమీద సానుభూతి లేదు. మావగారి స్వలాభంమీద అసహ్యం ఉంది. కొడుకుని నమ్మలేని ఆయన అపనమ్మకంమీద, తనని ఇంటి చాకిరీ గొడ్డులా చూస్తున్న వాళ్ళమీద మనుషులనే భావనేలేదు.

గుమ్మందాటి ఒక్కొక్క అడుగే వేస్తుంటే, ప్రతి అడుక్కి తన చీర అంచులచుట్టూ చీకటి పేరుకుంటున్నట్టుంది వసంతకి.

ఒక్క ఉదుటున లేచాడు తను.

చల్లటి మంచులాంటి మల్లెపూల రేకుల్ని, వొత్తయిన జుట్టుని చీల్చుకొని వెచ్చగా, వేడిసెగలా తలకి తగులుతోంది అతని ఊపిరి.

నెలరోజుల సమయాన్ని కొన్ని క్షణాలుగా మార్చే కౌగిలి అది. వసంతకి భర్త అంటే ఇష్టం. అంతకన్నా ఇద్దరూ కలిసి నిండుగా గడిపే రోజులమీద కోర్కె. ఏ అడ్డూ లేకుండా స్వతంత్రంగా తోడు నీడలా గడిపే ఆ జీవితమంటే ఆశ.

అందుకని ఆ కౌగిలిలో, ఆ చేతుల కోర్కె ఇరుకులో వొదిగిపోలేదు తను.

వొదిలించుకుని దూరంగా తొలిగిన భార్యవేపు చూశాడు రంగనాథం.

భర్త చూపుల్ని చూళ్ళేదు వసంత. ఇదొక్కటేనా దారి అని ఆలోచిస్తోంది తను. ఇదే మొదటిసారికాదు ఈ ఆలోచన.

ఈ ఆలోచనొచ్చినప్పుడల్లా గడచిన జీవితం గుర్తొచ్చేది వసంతకి. పెంచి పెద్ద చేసిన అమ్మమ్మ ప్రేమ. మూడుముళ్ళు వేయించగలిగానన్న తృప్తి పూర్తిగా పొందకుండానే ఆవిడ కళ్ళు మూసిన



# తెల్లటి చీకటి

వి.రాజారామమోహనరావు

అతి స్వల్ప వ్యవధిలోనే అసాధారణమైన జనాదరణ పొందిన
రావి శ్రీమన్నారాయణ
సరికొత్త నవలలు

1. హోనీమూన్
2. లేడీ టైపిస్టు
3. నిష్కలాటి మనిషి
4. ఎందరో భక్తులు!
5. మహామేధావి

ఒకో నవల ఖరీదు రు. 5-00
పాఠకులకు ప్రత్యేక తగ్గింపుధర! పోస్టేజితో సహా ఏ మూడు నవలలయినా రూ. 10/- మాత్రమే! ఒక నవలయితే రు. 4/-
నేడే వ్రాయండి!

ప్రతాప్ పబ్లికేషన్స్
మాచవరం - విజయవాడ-4.

ఆ క్షణం. పుట్టిల్లన్నది తెలియక ఈ ఇంటినే శాశ్వతంగా భావించుకొన్న రోజులు.

ఆ ఆలోచనల్లోనే ఈ నా కుమటుకు ఏమిటి అన్న భావన కలిగేది. ఎంత సరిపెట్టుకుందామన్నా భర్తతో కలిసి గడిపే రోజులే రవ్వు.


ఈ ఆరేళ్ళలో నెలకొక్క రోజే లెఖ్ఖగా కాకపోయినా అప్పుడప్పుడు పండగలకని, శెలవు దొరికినప్పుడు, రెండు మూడు రోజులు ఎవరో దగ్గరవాళ్ళ పెళ్ళికని శెలవుపెట్టి గడిపిన ఓ నెల రోజులు లేక పోలేదు. కాని ఆ జీవితం తృప్తి కలిగించ లేదు. అందరూ గడిపే సంసార జీవితాన్ని అందివ్వలేకపోయింది. నెల రోజులైనా ఒక్కరోజులాగే ఉండేది. భర్త మళ్ళీ వెళ్ళిపోతాడే అన్న భావన, ఆ తృప్తిని ప్రతి క్షణం పొడుస్తుండేది. అందుకే ఈ ఆలోచన.

భర్త తనదగ్గర కోరుతున్నది ఇదే. ఇదొక్కటే తనకున్న ఆయుధం. భార్యాభర్తలుగా నిండైన జీవితాన్ని తీర్చిదిద్దుకోవటానికి కోరుకుంటున్న హక్కుకోసం. భర్తలో ఉన్న పిరికితనాన్ని, చేతకాని మనస్తత్వాన్ని. కేవలం జీవితాన్ని నెలకి ఒక్క రాత్రిగానే ఆరేళ్ళనుంచి గడిపేస్తున్న అతనిలోని జడత్వాన్ని జాగృతం చేయటానికి తప్పుకాదు ఈదారైనా.

"మన పెళ్ళయి ఆరేళ్ళయింది" అంది అటు తిరక్కుండానే.

"అయితే" అన్నాడు.

రంగనాథానికి అసహనంగా ఉంది. కోర్కె తీరే అవకాశాన్ని సమయంతో కొలుచుకుంటున్నాడతను. అతనికి ఈ ఆలోచనల్లేవు. జీవితాన్ని వేరే మార్చుకోవాలన్న ఉద్దేశంలేదు, ఆ క్షణాన అతనికున్న బాధంతా వసంతని సుముఖంగా చేసుకోవటంవరకే పరిమితం. కోర్కెలో ఓర్పు కూడా నశిస్తోంది.




"అయితే ఏమిటండీ. ఇంకా ఎన్నాళ్ళిలా, గతిలేనట్టు తప్పదనట్టు. ఇలా నెలకొక్కసారి ఇదే బాగుందా."

"ఇప్పుడేమయిందని. ఎందుకు చెప్పు ఇలా అనవసరంగా."

వసంతకి ఏడుపు. కోపం వచ్చాయి. భుజంమీద ఆ చెయ్యి అసహ్యంగా ఉంది. భర్తలో ఆ క్షణాన కోర్కె కనిపించలేదు వసంతకి. కక్కుర్తి, లోభం కనిపించాయి.

"ఇలా నేనేం మొత్తుకుంటున్నా మీ మీ కక్కుర్తే బాగుందికదూ మీకు. ఆరేళ్ళనుంచీ మొగుడూ పెళ్ళాలా కాకుండా, దొంగల్లా, అర్ధరాత్రి ఇలా అఘోరించడమే ఆనందంగా ఉందికదూ. నేనీ ఇంట్లో చాకిరీచేస్తూ గొడ్డులా బతుకుతుంటే, అణాపూలకోసం అబ్బురంలా దేవుళ్ళాడుతుంటే నెలకోసారొచ్చి, ఇలా చేతకానితనంగా తప్పించుకుపోవటమే జీవితంలా ఉంది కదూ మీకు." ఈ బాధంతా, ఈ ఆవేశమంతా గొంతుకలోనే ఆగిపోయింది వసంతకి. బయటికి రాగలిగింది ఏడుపు ఒక్కటే.

మాట్లాడని వసంతేతప్ప ఇంకేం కనబడలేదు రంగనాథానికి. లైటువేపుంది

అతని దృష్టి, ఆ వెలుగు అతనికంత వీలుగాలేదు. అందుకనే లైటార్పేశాడు.

అసలే చీకటిగా ఉన్న వసంతకి ఇంకా చీకటిగా అనిపించింది. ఎంత గింజుకున్నా ఆ చీకట్లోంచి విముక్తి దొరకదనిపించింది. రెండు చేతుల్లో చుట్టేస్తున్నాడు రంగనాథం. అతని ఆవేశానికి ఎంతో వేడుంది. అతని కోర్కెకి నెల రోజుల బలం ఉంది. అరుదుగా దొరుకుతున్న అవకాశం అంత వుంది.



వసంత గింజుకుంది... రక్కింది... కొర్లింది.

చీకట్లో... పెళ్లినాటి ఆ మంచం మీద పాకుతున్నాడు రంగనాథం. చీకటిఅంచుల్ని పట్టుకు వేళ్ళాడుతున్నాడు. బలం పెంచుకుంటున్నాడు. అడుగుతున్నాడు.... బతిమాలుతున్నాడు-పిలుస్తున్నాడు.

"వద్దని .... ముట్టుకోవద్దని" కసింగా సన్నగా అరిచింది, తోసేసింది. భర్త నుంచి మరీ తప్పించుకునే సత్తువలేదు వసంతలో-చీకటిలో కూరుకుపోతున్నట్టు ఎన్నటికీ నెరవేరని ఆశ వెక్కిరిస్తున్నట్టు ఉంది.

"వసంతా ఏమిటిది- నాన్నా వాళ్ళు లేస్తారు. ప్లీజ్ ఊరుకో." అన్నాడు

రంగనాథం, తండ్రి మాట ఎత్తినప్పటికి ఇంకా కోపం వచ్చి మరీ బలంగా తోసింది వసంత, తల గోడకి తగిలి దిమ్మెక్కింది రంగనాథానికి. ఆవేశం తగ్గింది. ఏడుపొచ్చింది. చావని కోర్కె చంపుతోంది.

"వసంతా నానా తిప్పలూపడి నెలకోసారి వస్తే ఇలా. బాగుందా. నావల్ల కాదు వసూ. ప్లీజ్, ఇంక- వసూ."

రంగనాథం అరచేతులు రెండూ చెంపల మీద వెచ్చగా తగిలాయి వసంతకి. చచ్చిపోవాలనిపించింది. తనమీద తనకే ఎంతో అసహ్యం వేసింది. భర్త బతిమాలతున్న మాటలు, పరిస్థితి, జాలి.

వొదిగి అందుకుంది రంగనాథాన్ని, గుండెలకి హత్తుకుని చీకట్లోకి జారిగిపోయింది రంగనాథంతోపాటు.

● ● ●

ఆ రాత్రికి యాడాది నిండిన ఓ రోజు మల్లెపందిరి పక్కన నిలువెత్తు లేచిన మంట వసంత శరీరంతో భయంకరంగా మండింది.

ఆ ఎఱ్ఱటి ఊదారంగు మంటల్లో కిరసనాయిలుకి చోటుంది- వసంత గీచి వెలిగించిన అగ్గిపుల్లకి చోటుంది. తను కట్టుకున్న చీరకి, రంగనాథం అంత ఆవేశపు కోర్కెకి, పాతికేళ్ళ వసంత శరీరానికి చోటుంది కాని ఆ రాత్రికే చోటులేదు. సంసారాన్ని తృప్తిగా దిద్దుకోవాలన్న తన వ్యర్థ ప్రయత్నానికి చోటులేదు.

ఇంటిల్లపాది ఘొల్లుమన్నారు,

వసంత మావగారికి భయం వేసింది. తను చేసిందేమిటో తనకి తెలుసు. తనకి, కొడుక్కి-మధ్యనున్న అపనమ్మకానికోసం, తన కుటుంబానికి కనీసపు సగటు జీవితాన్ని సంపాదించుకోగలిగిన అవకాశం, స్థైర్యంలేని పరిస్థితికోసం, చేసిందేమిటో, ఆ మంటకి కారణ మేమిటో తెలుసు. అందుకని పిరిగ్గా ఇల్లంతా తిరిగాడు. ఎదుర్కోవలసిన దాన్నుంచి పట్టుకుని పారిపోయే అవకాశంకోసం వెతుకుతున్నాడు,

● ● ●

కాలి బొబ్బలెక్కి, వికృతంగా ఉన్న వసంత శవాన్ని చూశాడు రంగనాథం. భయంవేసింది. తిన్నగా చూళ్ళేకపోయాడు. లోలోపలి వ్యామోహం, పరిస్థితులకి అడుగున కప్పడిపోయిన ప్రేమ- మళ్ళీ చూశాడు, ఆ సన్నటి, తెల్లటి ఒళ్లు, ఓర్పుగా, ప్రేమగా తనని తాకే వేళ్ళు. ఏడుపు ఉండలా గొంతు కడ్డుపడింది రంగనాథానికి.

ఇప్పుడెలా అనుకున్నాడు. ఈ జీవితం ఏమిటనిపించింది. ఇంక నెల కొక్కసారి సెలవ పెట్టక్లేదనిపించింది.

"నెల కొక్కసారి. ఇలా దొంగల్లా" వసంత మాటలుగుర్తొచ్చాయి.

మొదటిసారిగా తన చేతకానితనం గుర్తింపుకొచ్చింది. అసహ్యం, ఏడుపు కోపం వచ్చాయి. తండ్రిమీద కోపం వచ్చింది. వసంతని నిలువునా చంపిన తండ్రిని చంపాలన్నంత కోపం వచ్చింది. ఆ కోపంలో తండ్రి స్వార్థమే తెలిసింది. ఇంకా ఆ స్వార్థం వెనకాల పరిస్థితి- రోజు గడవటంకోసం అలా చేయించిన ఆర్థిక స్థితి తెలియలేదు రంగనాథానికి. ఆడామగా అన్న తేడా లేకుండా, తిండి తినే ప్రతి మనిషి పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది ఆ యింట్లో అన్న గుర్తింపు రాలేదు- సమయంలేని ఆ రాత్రి విలువ తెలియలేదు ఇంకా.

రంగనాథం వెనక్కి పిల్లిలా వచ్చాడు తండ్రి. పెద్ద కుట్రకి మూల రహస్యం చెప్పేవాడిలా, రంగనాథం జుట్టుని, తలని మృదువుగా రాశాడు,

"లే, ఎంతసేపలా" అన్నాడు గొణిగిన వాడిలా-

"పోలీసు లొస్తారు, లే, నే చెప్పేది విను. ఏమేం చెప్పాలో- లేనిపోంది నీ బతుకు పాడుచేసుకోకు" అన్నాడు గొంతులోని ఆతృతని బలవంతంగా కప్పెడుతూ,

రంగనాథం కోపాని కెదురుగా పోలీసుల బలమైన కవచం. ఆ సమయంలో, పిరికి రంగనాథంలో ఇంకా పిరికిగా భయాన్ని ఇంజెక్ట్ చేశాడు తండ్రి-

వణుకుతున్న రంగనాథాన్ని, వణికే చేతుల్తో లేవదీశాడు తండ్రి, పక్కకి- వసంతనుంచి, జీవితంనుంచి, ధైర్యంనుంచి పక్కకు తీసికెళ్ళాడు, ఆ ఇంటి నిండా ఉన్న చీకటిని కమ్ముకున్న తెల్లటి ముసుగులోకి,

●●●